
సాక్షి
జనగామ

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



పరిశోధనలకు ప్రతిభాన్వేషణ
విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం వీవీఎం పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. - 8లో ▸



సమస్యలు తీరేదెలా..? - 9లో ▸
అర్జీలు ఇవ్వడమే తప్ప సమస్యలు తీరేదెప్పుడని ప్రజలు వాపోయారు. గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై 130 అర్జీలు అందజేశారు.

గరిష్టం/కనిష్టం
30⁰ /25⁰

వాతావరణం
ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

26న మినీ జాబ్ మేళా..

జనగామ రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ సెక్టార్ అపోలో ఫార్మసీ కంపెనీలో 50 ఖాళీలు ఉన్నాయని, నెలవారీ వేతనం రూ.11,600 నుంచి రూ.25,000 ఉంటుందని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలున్నాయని పేర్కొన్నారు. డీ, బీ, ఎం ఫార్మసి ఉండాలని టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, వయసు 18 నుంచి 25 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో ఈనెల 26న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఎస్–8 కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జె.గీత, సీనియర్ అసిస్టెంట్‌ను 7995430401 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

‘మెడికల్’ ఉద్యోగాలకు 141 దరఖాస్తులు

జనగామ: మెడికల్ కళాశాలతో పాటు జిల్లా ఆస్పత్రిలో 13 కేటగిరీల పరిధిలో భర్తీ చేయనున్న 50 పోస్టులకు సోమవారం మొదటి రోజు 141 దరఖాస్తులు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. ఈనెల 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

మూగజీవాలకు టీకాలు వేయించాలి

జనగామ రూరల్: వ్యాధులు సంక్రమించకుండా మూగజీవాలకు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక అధికారి రాధాకిషన్ అన్నారు. సోమవారం యశ్వంతాపూర్‌లో పీపీఆర్ వ్యాక్సిన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెలకు టీకాలు వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల విషయంలో పెంపకం దారులు జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులకు బలవర్ధక మైన ఆహారం ఇవ్వాలన్నారు. పశువైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది ఎండీ.హఫీజ్, రాజయ్య, నర్సింహులు, కనకరాజు, నజీర్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల బదిలీ

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎ.అబ్బయ్యను సీసీఎస్ వరంగల్‌నుంచి జనగామ జిల్లా నర్మెట సర్కిల్‌కు, నర్మెట సీఐ ఎం.సాయిరమణను వరంగల్ జిల్లా దుగ్గొండి సర్కిల్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా ఎస్‌ఐ చింత రాజు ను ఇంతేజార్‌గంజ్ పీఎస్ నుంచి ఎస్‌హెచ్‌ఓ కొడకండ్లకు, మరో ఎస్‌ఐ ఎస్.రాజన్‌బాబును వరంగల్ ట్రాఫిక్ నుంచి జనగామ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

సమాచార హక్కుపై శిక్షణ ఇవ్వండి..

జనగామ: జిల్లాలోని అన్ని శాఖల పబ్లిక్ ఇన్ఫర్మేషన్, అదనపు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లకు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇవ్వాలని రఘునాథపల్లికి చెందిన గణేష్ సింగ్‌ఠాకూర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌తో పాటు అనేక శాఖలకు సంబంధించి సమాచార హక్కు ద్వారా వివరాలు కోరగా సంబంధిత అధికారులు సమాచారం ఇచ్చే సమయంలో తప్పులుగా ఇస్తున్నారని పేర్కొన్నారు. కాగా రఘునాథపల్లి మాజీ సర్పంచ్ పోకల శివకుమార్‌పై చర్య తీసుకోవాలని సీఎం ఇచ్చిన ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను వినియోగించుకోవాలి

జనగామ : బీఎస్‌ఎన్‌ఎల్ సాంకేతిక పురోగతి సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయి) సీఏజీ మెంబర్ శోభా రాణి అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మొబైల్ రేడియేషన్, సైబర్ నేరాలు, నకిలీ మోసపూరిత కాల్స్ తదితర సందేహాలను నివృత్తి చేశారు. సబ్‌డివిజనల్ ఇంజనీర్ చంద్రగిరి ప్రసాద్, ఏజీఎం దయాకర్, ఎస్‌డీఈలు రాంప్రసాద్, శ్రీహరి, ప్రవీణ్, ఎలెందర్, రామచందర్, నరేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కార్తికేయ ఎంపిక



జఫర్‌గఢ్ : ఉప్పుగల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి పులి కార్తికేయ జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ముచ్చ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన కార్తికేయ ఈనెల 25 నుంచి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

కొమ్మూరి X సీనియర్స్



కంచె రాములు

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో రాజుకుంటున్న వర్గపోరు
- చర్చకు దారితీసిన హత్యాయత్నం ఫిర్యాదు
- క్రమశిక్షణ సంఘం దృష్టికి జనగామ వ్యవహారం
- రెండు వర్గాలుగా విడిపోయిన నాయకత్వం
- ముదురుతున్న ‘మార్కెట్’ వ్యవహారం

ఒకరిపై ఒకరు ఫిర్యాదులు..

కొద్ది రోజులుగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితోపాటు మరో వర్గానికి చెందిన సీనియర్ నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచె రాములు వర్గీయులు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, సీఎం వద్దకు వెళ్లి జనగామ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఆశిస్తున్న కంచె రాములును కాదని డీసీసీ అధ్యక్షుడు మరో పేరును సూచించడంతో సీనియర్లు సీరియస్ అయ్యారు. అయినా కొమ్మూరి యువ నాయకుల వైపే మొగ్గు చూపారు. ఈసారి బీసీ(ఏ) రిజర్వేషన్ ఉంది.. ఆ పదవి తనకే ఇవ్వాలని లోకుంట్ల ప్రవీణ్ పట్టు బడుతున్నాడు. అవసరమైతే కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమంటూ సవాల్ విసురుతుండంతో అధిష్టానం మార్కెట్ చైర్మన్ పదవి విషయాన్ని పెండింగ్‌లో ఉంచింది. ఏది ఏమైనా డీసీసీ అధ్యక్షుడు వర్సెస్ కంచె రాములు వర్గపోరు ఎటుదారి తీస్తుందో వేచిచూడాలి.

జనగామ: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వర్సెస్ సీనియర్ నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతోంది. కొమ్మూరి తనను హత్య చేయించేందుకు సుపారీ ఇచ్చాడని కంచె రాములు చేసిన ఫిర్యాదుతో జిల్లాలో పార్టీ అడ్డంగా చీలిపోయే పరిస్థితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు అంతా కలిసే ఉన్న నాయకత్వం.. లోక్‌సభ ఎన్నికలు వచ్చే సరికి రెండు వర్గాలుగా విడిపోయింది. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో తన ఓటమికి కారణమయ్యారంటూ కొంతమంది నాయకులపై ప్రతాప్‌రెడ్డి బహిరంగంగానే విమర్శలు గుప్పించడంతో ఇరువురి మధ్య దూరం పెరిగింది. కొమ్మూరి నిర్లక్ష్యం, ఒంటెద్దు పోకడలతోనే ఓడిపోయారే తప్ప.. నాయకులు, కార్యకర్తల తప్పు లేదని మరోవర్గం అంటోంది. ఇద్దరి మధ్య రాజుకున్న వివాదం.. పార్టీ అధిష్టానం వద్దకు చేరింది. రోజుకో ఫిర్యాదుతో రెండు వర్గాల వారు గాంధీభవన్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం ప్రతినిధులకు ఫిర్యాదు చేసుకుంటున్నారు. పార్టీ ఇచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని వేర్వేరుగా నిర్వహిస్తూ గ్రూపులకు ఆజ్యం పోస్తున్నారు. దీంతో దిగువ శ్రేణి నాయకత్వం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

రెండు వర్గాలుగా విడిపోయి..

పార్టీ నాయకులు, శ్రేణులు జనగామ నుంచి కొమురవెల్లి వరకు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ ప్రతిపక్షాన్ని తలపించేలా వ్యవహరిస్తున్నాయి. డీసీసీ అధ్యక్షుడి ఫొటో లేని ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ.. చించి వేసుకునే స్థాయికి దిగజారి పోతున్నారు. ప్రతిపక్షంలో పదేళ్లు ఉండి పార్టీని కాపాడుకుంటే.. కొమ్మూరి బాధ్యతలు తీసుకున్న తర్వాత సీనియర్లను పక్కన పెడుతున్నారన్న పంచాయితీ తెలిసిందే. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకం కొమ్మూరి వర్సెస్ సీనియర్ల మధ్య మరింత దూరం పెంచగా, చినికి చినికి గాలివానలా మారింది. హత్య చేయించేందుకు డీసీసీ అధ్యక్షుడు సుపారీ ఆఫర్ చేశారంటూ ఆ పార్టీ నేత కంచె రాములు పోలీసులకు ఫిర్యాదు చేసుకునే వరకు వెళ్లింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంచె రాములును హత్య చేయించేందుకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రాహుల శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి రూ.25లక్షలు ఆఫర్ చేసి కుట్ర పన్నారని డీసీసీకి ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయాన్ని పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు రాములు చెప్పగా.. తనపై అనవసరంగా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ డీసీసీ అధ్యక్షుడు కొట్టి పారేశారు. ‘అసలు శ్రీనివాస్‌రెడ్డి నా శత్రువు.. సోషల్ మీడియాలో నాకు వ్యతిరేఖంగా పోస్టులు పెడుతున్నాడు. అంభాడాలు వేస్తున్నాడు.. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని’ కొమ్మూరి కోరడం గమనార్హం.

చదరంగంలో మన అర్జునుడు..

- బుడాఫెస్ట్‌లో వరంగల్ క్రీడాకారుడు అర్జున్ అత్యుత్తమ ప్రతిభ
- ప్రపంచ మూడో స్థానం.. ఇండియా నంబర్ వన్ చెస్ చాంపియన్‌గా గుర్తింపు
- అక్టోబర్ 28న హనుమకొండకు..
- హద్దులు లేని ఆనందంలో తల్లిదండ్రులు



స్వర్ణ పతకం సాధించిన ఆనందంలో చెస్ క్రీడాకారుడు అర్జున్

వరంగల్ స్పోర్ట్స్: మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధాన్ని అర్జునుడు ముందుండి గెలిపిస్తే.. మన ఓరుగల్లు అర్జునుడు చదరంగంలో భారత్‌ను తన మేధో సంపత్తితో గెలిపించాడు. చదరంగంలో ఎత్తుకు పై ఎత్తులతో ప్రపంచంలో మూడో స్థానంలో నిలిస్తే, భారతనంబర్ వన్ చెస్ విజేతగా నిలిచాడు. 21 సంవత్సరాల పిన్న వయస్సులో స్వర్ణం గెలిచి భారత చదరంగ క్రీడా చరిత్రలో తన పేరు, జిల్లాపేరును సువర్ణ అక్షరాలతో లిఖించాడు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ శ్రీనివాసరావు జ్యోతి దంపతుల కుమారుడు అర్జున్ 14 సంవత్సరాల వయస్సులోనే యూఏఈలో నిర్వహించిన అబుదాబి మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో 17వ స్థానంలో నిలిచి గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకున్నాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి తొలి జీఎం సాధించి రికార్డును సొంతం చేసుకున్నాడు. తాజాగా బుడాఫెస్ట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన 45వ చెస్ ఒలింపియాడ్‌లో అర్జున్ కీలకంగా నిలిచి భారత్‌కు స్వర్ణం తీసుకొచ్చాడు. వ్యక్తిగత విభాగాల్లోనూ బంగారు పతకాన్ని సాధించి ఔరా అనిపించాడు. చదరంగంలో అర్జున్ ప్రతిభపై తల్లిదండ్రుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి.

మొదటి గురువు.. మా నాన్నే



కుటుంబ సభ్యులతో అర్జున్

నాకు మా నాన్నే మొదటి గురువు అని ఇండియా నంబర్ వన్ చెస్ చాంపియన్ అర్జున్ తెలిపారు. బుడాఫెస్ట్‌లో ప్రతిష్టాత్మక విజయాన్ని సొంతం చేసుకున్న ఇరిగేశి అర్జున్ సోమవారం ‘సాక్షి’తో ఫోన్‌లో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

చెస్ బోర్డు అంటే ఎలా ఉంటుందో కూడా తెలియదు. సరిగ్గా నాకు ఎనిమిదేళ్ల వయస్సులో ఇంట్లో ఆడుకుంటున్న నా ముందు మా నాన్న చెస్ బోర్డు ఉంచినట్లు గుర్తు. ఇలా ఆడాలని నాచే ఓనమాలు దిద్దించారు. నేను ఈ రోజు విజయం సాధించానంటే మా నాన్న ప్రోత్సాహమే కారణం. నా విజయానికి నాంది పలికిన మా నాన్నే నా మొదటి గురువు.

హనుమకొండలోనే మొదటి శిక్షణ

మా నాన్న మొదటిసారిగా బాలసముద్రంలోని కోచ్ బొల్లం సంపత్ దగ్గర చేర్పించారు. సార్ దగ్గర దాదాపు రెండేళ్లపాటు శిక్షణ పొందాను. ఆ తర్వాత ఇజ్రాయిల్ గ్రాండ్ మాస్టర్ విక్టర్ మిఖా లేవస్కీ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ప్రస్తుతం రష్యన్ కోచ్ రుస్తుం ఖాజీం జానవ్ వద్ద శిక్షణ పొందుతున్నాను. ప్రతీరోజు 10 గంటలు శిక్షణకే సమయం కేటాయిస్తూ వస్తున్నాను.

బుడా ఫెస్ట్ టు జర్మనీ

ఈ నెల 27, 28వ తేదీల్లో జర్మనీలో బుండాస్ లీగ్ మ్యాచ్ ఉంది. అందులో పాల్గొనేందుకు వెళ్తున్నాను. అనంతరం అక్టోబర్ 3 నుంచి యూకేలో చాంపియన్ చెస్ టూర్ ఉంది. ప్రపంచ స్థాయి మ్యాచ్‌లు ముగిశాయి. అక్టోబర్ 28వ తేదీన భారత్‌కు అందులో హనుమకొండకు వస్తాను.

విద్యుత్ ఫీడర్ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్



ఫీడర్ పనులు పనులు పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

జనగామ రూరల్: జనగామ మండలం చీటకోడూర్‌లో ఫీడర్ సమస్య కారణంగా పంటలకు నీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులు ఎట్టకేలకు తీరాయి. రైతులు ఎందుర్కొంటున్న సమస్యలపై ‘పంటలు ఎండుతున్నా.. పట్టించుకోరా’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు సోమవారం స్పందించారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌లో అదనపు ఫీడర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా ‘సాక్షి’కి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిడిగొండ సొసైటీలో అక్రమాలపై విచారణ

- రికార్డులు సీజ్ చేసిన అధికారి దివ్య



రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న విచారణాధికారి దివ్య

రఘునాథపల్లి: నిడిగొండ సొసైటీలో అక్రమాలపై విచారణ మొదలైంది. సోమవారం సొసైటీ కార్యాలయంలో విచారణాధికారి, జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. పలు గ్రామాలకు చెందిన సొసైటీ రైతులు చేరుకొని విచారణాధికారికి తమ సమస్యలు ఏకరువు పెట్టారు. ఒక్కొక్కరి పేరుపై నాలుగైదు ఆధార్ నంబర్లు అనుసంధానం చేశారని, గతంలో అప్పులు చెల్లించినా బకాయి ఉన్నట్టు చూపుతున్నట్లు పేర్కొన్నారు. సొసైటీ సీఈఓలుగా పని చేసిన తండ్రీకొడుకుల అక్రమాలతో రుణమాఫీకి దూరమయ్యామని వాపోయారు. విచారణాధికారి దివ్య మాట్లాడుతూ రుణమాఫీకి 554 మంది రైతులు అర్హత పొందగా అందులో 135 మంది రైతుల ఆధార్ వివరాలు తప్పుగా నమోదు చేయడం, ఇతర కారణాలతో మాఫీకి నోచుకోలేదన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు. రైతులు మాసాన్‌పల్లి శాంతోజీ, ఎలపాటి ప్రభాకర్‌రెడ్డి, కాసర్ల లక్ష్మయ్య, మైలారపు ఆంజనేయులు, పెద్దగోని శ్రీనివాస్, కర్ణాకర్‌రెడ్డి, నర్సింగరావు, తిప్పారపు రవీందర్ పాల్గొన్నారు.

25 నుంచి అక్టోబర్ 7 వరకు విచారణ

సొసైటీ పరిధి 12 గ్రామాలకు చెందిన రైతులతో ఈనెల 25 నుంచి అక్టోబర్ 7 వరకు నిడిగొండ కార్యాలయంలో వివరాలు సేకరించేందుకు నోటీసులు పంపనున్నట్లు విచారణాధికారి దివ్య తెలిపారు. 25న నిడిగొండ, పడమటి గుంటూరుగూడెం, 28న ఎల్లారెడ్డిగూడెం, కల్వలపల్లి, 30న శ్రీమన్నారాయణపురం, అక్టోబర్ 1న మాధారం, 3న ఫతేషాపూర్, లక్ష్మీతండా, 4న ఇబ్రహీంపూర్, 5న దాసన్నగూడెం, 7న సోమయ్యకుంటతండా రైతులు ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల వరకు పత్రాలతో హాజరు కావాలని కోరారు.

పాలకుర్తిలో పొలిటికల్ గేమ్ షురూ

- కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి దయాకర్‌రావుకు జైలు తప్పదు
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల : పాలకుర్తిలో పొలిటికల్ గేమ్ మొదలైంది.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు హైదరాబాద్ హైడ్రా తరహాలో పాలకుర్తిలో త్వరలో ‘హైడ్రా’ అమలు చేస్తామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యాన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. పాలకుర్తి ప్రజల కోసం అమెరికాలో రూ.వేలకోట్ల ఆస్తులు వదులుకొని వచ్చి నియోజకవర్గ ప్రజల మద్దతుతో ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేసిన తమపై.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన అనుచరులచేత నిత్యం ఆరోపణలు చేయిస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అభద్రతా భావంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ముసుగులో కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తే ఎవరు జైలు పాలయ్యారో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. స్త్రీనిధి కింద రూ.450 కోట్ల కుంభకోణంతో పాటు ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో ఎర్రబెల్లి దయాకర్‌రావుకు జైలు తప్పదని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే భూదందాలు, మైనింగ్, ఇసుక అనుమతులు ఇచ్చి ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టివేడయం శోచనీయమన్నారు. ఉద్యమాల గడ్డ దేవరుప్పుల వేదికగా ప్రత్యర్థులతో పొలిటికల్ గేమ్‌కు సిద్ధమయ్యామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో నాయకులు రాపాక సత్యనారాయణ, నల్ల శ్రీరాములు, ఉప్పల సురేష్‌బాబు, పరీదుల భాస్కర్, ధర్మారెడ్డి, పాండు కృష్ణ, బాగాల మాలతి, గణేష్, నాగరాజు, సజ్జన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి నిరీక్షణ..!



ఎంసీహెచ్‌లోని గైనిక్ ఓపీ వద్ద కూర్చోవడానికి సరిపడా సీట్లు లేక నిరీక్షిస్తున్న గర్భిణులు, అటెండెంట్లు

- గాడి తప్పిన ఎంసీహెచ్ పాలన
- విధులకు ఆలస్యంగా వైద్యులు
- చంటి పిల్లల తల్లుల పడిగాపులు
- డెంగీ, మలేరియా టెస్ట్ ట్యూబ్‌లు.. యూరిన్, గర్భిణి టెస్ట్ కిట్ల కొరత

జనగామ: మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో పాలన గాడితప్పింది. సమయానికి విధులకు హాజరుకాని వైద్యుల తీరుతో వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులకు నిరీక్షణ తప్పడంలేదు. దీనికితోడు డెంగీ, మలేరియా టెస్ట్ ట్యూబ్‌లు, యూరిన్, గర్భిణి టెస్ట్ కిట్ల కొరతతో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా తరుచూ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్నా తీరు మారకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంసీహెచ్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు డ్యూటీలో ఉండాల్సిన కొంత మంది డాక్టర్లు.. 10 గంటలు దాటినా పత్తాలేరు. చిన్న పిల్లలు, గర్భిణుల ఓపీ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 10 గంటలకు, చిన్న పిల్లల పరీక్షలు 10.30 గంటలకు మొదలయ్యాయి. ఉదయం 8 గంటలకే ఆస్పత్రికి వచ్చిన పేషంట్లు రెండున్నర గంటల పాటు వైద్యుల కోసం నిరీక్షించారు. చిన్న పిల్లల ఓపీ వద్ద 50 మంది కూర్చొని ఉండగా.. మరో వంద మంది రెండు గంటల పాటు నిలబడి అవస్థలు పడ్డారు. గర్భిణులనల పరిస్థితి మరీ దారుణం. పైనుంచి పడే సూర్యకిరణాల వేడిమి.. దీనికి తోడు కనీసం ఫ్యాన్లు కూడా లేవు. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన కూలర్లు మూలన పడేశారు. దీంతో రోగులు నరకం చూశారు.

టెస్ట్ కిట్ల కొరత



మందుల దుకాణంలో కొనుక్కొచ్చిన టెస్ట్ ట్యూబ్‌లు చూపుతున్న మహిళ

ఎంసీహెచ్‌లో డెంగీ, మలేరియా టెస్ట్ ట్యూబ్‌లు, యూరిన్, గర్భిణి టెస్ట్ కిట్లతో పాటు సిరంజీలు, సర్జికల్ పరికరాల కొరత విపరీతంగా ఉంది. నిత్యం 150 నుంచి 200 మందికి రక్త పరీక్షలు నిర్వహిస్తుండగా.. 300 టెస్ట్ ట్యూబ్‌లు, 60 మలేరియా, డెంగీ, 50 మందికి యూరిన్, 300లకు పైగా 2 ఎంఎల్ డిస్పోజల్ ఇంజక్షన్లు అవసరం. రెండు నెలలుగా వీటిని రోగుల చేత ప్రైవేట్‌లో కొనిపిస్తున్నారు. కొన్ని పరీక్షలకు సంబంధించి ఆస్పత్రికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగామ డయాగ్నోస్టిక్స్‌కు పంపిస్తున్నారు. అక్కడికి వెళ్లి రావడానికి పెట్టే ఆటో చార్జీలకు బదులుగా స్థానికంగా ఉన్న ప్రైవేట్ దుకాణాల నుంచి తెచ్చుకుని పరీక్షలు చేయించుకుంటున్నారు. గడిచిన పది రోజుల కాలంలో ఎంసీహెచ్‌లో గైనిక్, చిన్న పిల్లల ఓపీ విభాగంలో 2,817 మంది పరీక్షలు చేయించుకోగా.. మొత్తం 321 మందిని అడ్మిట్ చేసుకున్నారు.

ఉదయం 9 గంటలకు వచ్చా..



పాపకు జ్వరం వస్తే చూపించేందుకు ఉదయం 9 గంటలకు ఎంసీహెచ్‌కు వచ్చాను. పాపకు ఒళ్లు కాలిపోతున్నా.. డాక్టర్ కోసం గంట సమయానికి పైగా వేచి చూడాల్సి వచ్చింది.

- అనూష, శివాజీనగర్, జనగామ

డాక్టర్ 10.30 గంటలకు వచ్చారు..



చంటిపాపకు జ్వరమొస్తే ఉదయం 8.30 గంటలకు వచ్చాను. డాక్టర్ 10.30 గంటలకు వచ్చారు. అప్పటి వరకు ఎవరూ పరీక్ష చేయలేదు. వైద్యులు సకాలంలో వస్తే ఇబ్బందులు ఉండవు.

- వర్షిత, గిర్నిగడ్డ, జనగామ

క్యూలో గంటన్నర ఉన్నాము



పాపకు జ్వరం రావడంతో ఐదు కిలోమీటర్ల దూరం నుంచి 9 గంటలకు ఆస్పత్రికి వచ్చాను. డాక్టర్ 10.30 గంటలకు వచ్చారు. గంటన్నర పాటు క్యూలో నిలబడ్డాను. చాలా ఇబ్బంది అయింది.

- ఎల్.జగన్, జనగామ

డిస్పోజల్ సిరంజి కొనుక్కొచ్చిన..



బాబుకు జ్వరం వస్తే రక్త పరీక్షలు రాశారు. రక్తం తీయడానికి డిస్పోజల్ సిరంజి లేదంటే ప్రైవేట్ మందుల దుకాణంలో తెచ్చుకున్నాను. ఇంతకు ముందు చేయించిన రక్త పరీక్షల రిపోర్టు కూడా రాలేదు.

- ఎ.నర్సింహులు,నర్మెట

వైద్యులు సమయపాలన పాటిస్తున్నారు..

వైద్యులు సమయపాలన పాటిస్తున్నారు. ఎమర్జెన్సీ సేవల కోసం వార్డులకు వెళ్లే సమయంలో ఓపీ ఆలస్యం అవుతోంది. చిన్న పిల్లలు, గర్భిణుల ఓపీకి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. డెంగీ, మలేరియా పరీక్షలకు డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపిస్తున్నాం. పేషంట్ల సంఖ్య పెరగడంతో 2 ఎంఎల్ సిరంజి కొరత ఏర్పడుతోంది.

- డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సూపరింటెండెంట్

కేర్ టేకర్‌ను మార్చాలి

- కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జనగామ రూరల్: బచ్చన్నపేటలోని మోడల్ స్కూల్ హాస్టల్ కేర్ టేకర్‌ను మార్చాలని, అలాగే నర్మెట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్లు, ప్రహరీ నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన విద్యార్థులతో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ హాస్టల్ కేర్ టేకర్ ప్రవర్తన సరిగాలేదని వెంటనే మార్చి మెను ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. నాయకులు లవకుమార్, సుమా, యాకన్న, అఖిల, మురళి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్ : అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ అనంతరం జిల్లా అధికారులందరితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శనలు తప్పనిసరిగా చేయాలని, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆస్పత్రులను పర్యవేక్షించాలని చెప్పారు. ఫీల్డ్ విజిట్ నివేదికను ప్రతీ నెల 5వ తేదీ వరకు సీపీఓ ద్వారా సమర్పించాలని సూచించారు. సమావేశంలో ఘనపూర్(స్టేషన్) ఆర్డీఓ వెంకన్న, జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్‌డీఓ వసంత, సీపీఓ ఎల్.శ్రీనివాస్, డీఈఓ రాము, డీపీఓ స్వరూప, డీఏఓ రామారావునాయక్ పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రతిభాన్వేషణ..

6 నుంచి 11వ తరగతుల విద్యార్థులకు పరీక్ష
- ఎంపికైతే స్కాలర్‌షిప్స్, పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- ఈనెల 25 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం



విద్యారణ్యపురి: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత ప్రతిభను వెలికి తీసే వివిధ కార్యక్రమాలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే పరిశోధన, ప్రయోగాల్లో కూడా రాణించేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీ.వీ.ఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. ఈ విద్యాసంవత్సరం 2024–25లో విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమై గడువు ముగిసింది. అయితే ఈ గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఆరు నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ ప్రతిభాన్వేషణ పరీక్షకు హాజరుకావొచ్చు.అందుకోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఎంపికైతే భారత దేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ పొందే అవకాశం లభిస్తుంది.

జూనియర్, సీనియర్ విభాగాల్లో పరీక్ష

ఈ పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. ఇందులో జూనియర్ అంటే 6,7, 8 తరగతులు, సీనియర్ అంటే 9 నుంచి 11 వరకు ఒక గ్రూప్‌గా పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ తదితర భారతీయ భాషల్లోనూ ఈ పరీక్ష ఉంటుంది.

వంద మార్కులకు పరీక్ష

ప్రధాన పరీక్షలు అక్టోబర్ 23, 27 తేదీల్లో ఉంటాయి. ఇందులో తమకు అనువైనరోజు పరీక్ష రాసే వెసులుబాటు కూడా ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అవకాశం ఉంటుంది. 90 నిమిషాల పాటు పరీక్ష రాయాల్సింటుంది (ఆన్‌లైన్). పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలోనే ప్రశ్నలు ఉంటాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లోనూ వంద మార్కుల చొప్పున ప్రశ్నలు ఉంటాయి.

రిజిస్ట్రేషన్ విధానం

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ. 200 ఫీజు చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సింటుంది. ఈ ఏడాది మేలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ కాగా ఈనెల15వ తేదీతో గడువు ముగిసింది. ఆ గడువును ఈనెల 25 వరకు పొడిగించారు. ప్రతిభాన్వేషణ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహిస్తారు. ఆ పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, లాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒకదాని ద్వారా నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పాఠశాల నుంచైనా ఇంటి నుంచైనా పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. పాఠశాల, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఈ పరీక్షలు ఉంటాయి. ఇప్పటికే సంబంధిత వెబ్‌సైట్‌లో పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక ఇలా..

పాఠశాల స్థాయిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతికి 20 మందిని ఎంపిక చేస్తారు. 6నుంచి 11తరగతుల్లో మొత్తం 120మందిని ఎంపికచేస్తారు. వీరికి డిసెంబర్ 8,15,22లో ఏదైనా ఒకరోజు రాష్ట్రస్థాయి క్యాంపు నిర్వహిస్తారు. అక్కడ ఆఫ్‌లైన్‌లోనే పరీక్ష జరగనుంది. ప్రతిభ చూపిన వారిలో ప్రతి తరగతి నుంచి ముగ్గురి చొప్పున మొత్తం 18 మందిని ఎంపిక చేస్తారు. ఇందులో మొదటిస్థానం సాధించిన విద్యార్థికి రూ 5వేలు, ద్వితీయ స్థానం రూ. 3వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ. 2వేలు, సర్టిఫికెట్ అందజేస్తారు.

జాతీయ స్థాయికి ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతి తరగతి నుంచి ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరిని హిమాలియన్స్‌గా పిలుస్తారు. జాతీయస్థాయి క్యాంపు వచ్చే ఏడాది మే 17,18 తేదీల్లో ఉంటుంది. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి ప్రథమ స్థానం రూ. 25వేలు, ద్వితీయ స్థానం రూ.15 వేలు, తృతీయ స్థానం రూ. 10వేలు మెమోంటో, ప్రశంస పత్రాలు అందజేస్తారు.

ప్రతిభ నిరూపణకు విజ్ఞాన్ మంథన్



ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతీయుల కృషిని పాఠశాల స్థాయి విద్యార్థులకు తెలియజేయడం విజ్ఞాన్ మంథన్ లక్ష్యం. ప్రతిభాన్వేషణ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధులను చేయాలి. ప్రతిభ చూపితే ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా భాస్కర స్కాలర్ షిప్ పథకం పొందే అవకాశం కూడా ఉంటుంది. విద్యార్థులు విజ్ఞాన్ మంథన్‌కు రిజిస్ట్రేషన్ చేసుకునేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

- పోతరాజు ఆనందం
విజ్ఞాన మంథన్ స్టేట్ కోఆర్డినేటర్

‘బీపీ’ పేరుతో బురిడీ!

50 రోజుల్లో...రూ.2,84,350 ఆదాయం వస్తుందని మోసం
- బ్రిటీష్ పెట్రోలియం కంపెనీ పేరుతో లింక్, యాప్
- రూ.700 నుంచి రూ.75,800 వరకు వసూలు
- నిజమని మోసపోతున్న వందలాది మంది బాధితులు



సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్ల కొత్త ఆలోచనలకు హద్దే లేకుండా పోతోంది. జాన్సన్ అండ్ జాన్సన్, సింజెంటా కంపెనీ పేర్లతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది బాధితులను మోసగించిన సైబర్ క్రిమినల్స్ ఇప్పుడు బ్రిటీష్ పెట్రోలియం (బీపీ)లోగోతో లింక్, యాప్‌ను రూపొందించి జనాల ఆశను క్యాష్ చేసుకుంటున్నారు. రెన్యూబుల్ ఎనర్జీ పరికరాలపై కేవలం రూ.700 పెట్టుబడి నుంచి మెల్లగా ఆశచూపి రూ.75,800 వరకు ఇన్వెస్ట్ చేస్తే కేవలం 50 రోజుల వ్యవధిలో రూ.1890 నుంచి రూ.2,84,350 వరకు సంపాదించవచ్చని బురిడీ కొట్టిస్తున్నారు. ఇటీవల వ్యవసాయ పరికరాల ఉత్పాదకతలో అగ్రగామిగా ఉన్న సింజెంటా కంపెనీ పేరుతో చేస్తున్న మోసాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగానే బ్రిటీష్ పెట్రోలియం (బీపీ) పేరుతో ఆకర్షించే ఆఫర్లను ఇస్తున్నట్టుగా కంటెంట్ సృష్టించి క్యాష్ చేసుకుంటున్న మరో మోసం వెలుగులోకి వచ్చింది. https://www.bpashop.top/ లింక్ ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్‌లో వివిధ వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. ఈజీమనీ ఆలోచనతో కూడిన ఈ లింక్ తెరిస్తే బ్రిటీష్ పెట్రోలియం పూర్వాపరాలు అందులో నిక్షిప్తమై ఉండడంతో నిజమని నమ్ముతున్నారు. 50 రోజుల వ్యవధిలోనే లక్షాధికారులం కావొచ్చని వందలాది మంది పెట్టుబడులు పెడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా మోసం చేసే యాప్‌లపై రాష్ట్ర పోలీసులు దృష్టి సారించి జనాలను అప్రమత్తం చేయాల్సిన అవసరముందనే వాదన వినిపిస్తోంది. ఇంకోవైపు ఈ తరహా యాప్‌ల్లో డబ్బులు వస్తాయని పెట్టుబడులు పెట్టిన వారు ఫిర్యాదు చేస్తే ఎక్కడ తమ పరువు పోతుందేమోనని చాలామంది మిన్నకుండిపోతున్నారు.

తొలుత నమ్మించి...ఆ తర్వాత మోసం

మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) మాదిరిగానే ఈ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో ఆకర్షించే పెట్టుబడి పథకాలు రూపొందిస్తున్నారు. లింక్ ద్వారా తొలుత పెట్టుబడిన పదుల సంఖ్యలో మందికి కొన్ని డబ్బులు క్రెడిట్ అవుతున్నాయి. నిజమని నమ్మిన వీరు ఇన్విటేషన్ లింక్‌లు పంపడం ద్వారా మరికొన్ని డబ్బులు తమకు వస్తాయనే ఆశతో పరిచయస్తులు, స్నేహితులు, బంధువులకు పంపిస్తున్నారు. మనకు తెలిసిన వ్యక్తే అందులో పెట్టుబడి పెట్టడంతో నిజమని నమ్మిన వందలాది మంది ఆయా పరికరాలపై ఇన్వెస్ట్ చేస్తున్నారు. తొలుత రూ.700 పెట్టుబడి పెట్టించి నమ్మించి ఆ తర్వాత దశలవారీగా వేలల్లో డబ్బులు ఇన్వెస్ట్ చేశాకే బిచాణా ఎత్తేస్తున్నారు. ఈ విధంగా ఆయిల్ అండ్ గ్యాస్, రిఫైనింగ్ నుంచి బయో ఎనర్జీ (కన్వీనెన్స్, ఈవీ చార్జింగ్, హైడ్రోజెన్, రిన్యూవబుల్స్ అండ్ పవర్) వైపు అడుగులు వేస్తున్న బీపీ కంపెనీలో పెట్టుబడులు పెడితే ధనికులు కావొచ్చని ప్రచారం చేస్తున్నారు.

ఆఫర్లు.. మోసం చేస్తున్నారిలా..

- కమర్షియల్ ఈవీ చార్జింగ్ స్టేషన్ పిల్లర్ డీసీ చార్జర్ పరికరంపై రూ.700 ఇన్వెస్ట్ చేస్తే రోజువారీగా రూ.42 ఆదాయం 45 రోజుల వరకు రూ.1,890 వస్తుంది.
- డ్యూవల్ ఈవీ చార్జర్‌పై రూ.5,800 ఇన్వెస్ట్ చేస్తే రోజువారీగా రూ.365 ఆదాయం 46 రోజుల పాటు రూ.16,790 వస్తాయి.
- ఈవీ కూలింగ్ సిస్టమ్ పై రూ.12,800 పెట్టుబడి పెడితే రోజువారీగా రూ.844 ఆదాయం 47రోజులపాటు రూ.39,668 వస్తాయి.
- మరో పరికరమైన ఈవీ చార్జింగ్‌పై రూ.25,800 ఇన్వెస్ట్ చేస్తే రోజువారీగా రూ.1,780 చొప్పున 48 రోజులపాటు 85,440 ఆదాయం వస్తుంది.
- డీసీఫాస్ట్ ఈవీ చార్జింగ్ సిస్టమ్‌పై రూ.45800 ఇన్వెస్ట్ చేస్తే రోజువారీగా రూ.3,297 ఆదాయం 49 రోజులపాటు రూ.1,61,553 వస్తాయి.
- డీసీఫాస్ట్ ఈవీ చార్జింగ్ సిస్టమ్ విత్ ఏ కేబుల్ మేనేజ్ మెంట్ సిస్టమ్ పరికరంపై రూ.75,800 ఇన్వెస్ట్ చేస్తే రోజువారీగా రూ.5,687 ఆదాయం.. 50 రోజుల్లో రూ.2,84,350 వస్తుందని ఊరిస్తున్నారు.
- ఇది నిజమని నమ్మిన వందలాది మంది మోసపోతున్నారు. ఈ తరహా కేసులు కొన్ని పోలీసులు నమోదు చేసినా నిర్వాహకులను పట్టుకోవడం, రికవరీ అసాధ్యంగా మారింది.

గుడ్డి నమ్మకంతో ఇన్వెస్ట్ చేయొద్దు



ఈజీమనీ స్కీమ్‌లన్నీ స్కామ్‌లు. తెలిసిన వారు, బంధువులు ఇన్వెస్ట్ చేశారనే గుడ్డి నమ్మకంతో రూ.వేలు, రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి మోసపోద్దు. మోసపోయిన వారు వెంటనే ఫిర్యాదు చేస్తే ఈ బడా రాకెట్ నిర్వాహకులను పట్టుకునే అవకాశం ఉంటుంది.

- అంబర్ కిశోర్ ఝా, వరంగల్ పోలీసు కమిషనర్

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవాలి

- సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్
- పదేళ్లలో తెలంగాణలో వనరులు కొల్లగొట్టారు
- ఎమ్మెల్సీ కోదండరాం




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం, సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్

కేయూ క్యాంపస్ : విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిటైర్డ్ ఆచార్యుడు, సామాజికవేత్త ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ‘డికెడల్‌డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఇష్యూస్ అండ్ చాలెంజెస్’ అనే అంశంపై క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో నిర్వహించిన సింపోజియంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను పట్టిష్టం చేయాలన్నారు. గత ప్రభుత్వం ఈ రంగాలను పట్టించుకోలేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 221 కేసులను పెట్టారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశంగా పాలించిందని విమర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ. నాలుగున్నర లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడిన యువకులు, విద్యావేత్తలు, మేధావుల ఆలోచనల విధానాలను విస్మరించి అధికారంలోకి రాగానే నిరంకుశ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టును డీపీఆర్, సరైన అనుమతులు లేకుండానే నిర్మించిందన్నారు. వివిధ పథకాల ద్వారా వనరులు కొల్లగొట్టారని విమర్శించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిటైర్డ్ ఆచార్యుడు డి. నర్సింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు నియామకాల కోసం జరిగిందన్నారు. అయితే తెలంగాణ ఏర్పడిన అనంతరం ఈ అంశాలు కనుమరుగయ్యాయన్నారు. వ్యవసాయ రంగంలో 91శాతం మంది చిన్న కారు, సన్నకారు రైతులే ఉన్నారన్నారు. వీరి పంటలకు కనీస మద్దతు ధర కల్పించాల్సింది పోయి రైతుబంధు పేర రూ. 5వేలు, రూ. 10వేలు ఇస్తుండడం సరికాదన్నారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ఇవ్వాలన్నారు. ఈ సింపోజియానికి ఎకనామిక్స్‌విభాగం అధిపతి బి. సురేశ్ లాల్ అధ్యక్షత వహించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు పుల్లూరి సుధాకర్, రిటైర్డ్ ఆచార్యుడు కె. వెంకటనారాయణ మాట్లాడారు. బోధన, బోధనేతర, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్: నిరుపేదల సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ లో హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్, ఖిలావరంగల్ మండలాల పరిధిలోని 454 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 97 లక్షల 96 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంత్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్య, వైద్యం, అభివృద్ధి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి అమలు చేస్తున్నారన్నారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి ప్రతి కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. 2050 వరకు జనాభా పెరుగుదల దృష్టిలో ఉంచుకుని వరంగల్ నగర అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, ఫార్మా సిటీ, ఐటీ సర్వీసెస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, ఎకో టూరిజం, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్, స్టేడియం, ఎయిర్ పోర్టు, లాజిస్టిక్స్ పార్కు, టూరిజం వంటి అంశాలు ప్రధానంగా ఉండేలా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. వరంగల్ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను యుద్ధ ప్రతిపాదికన చేపడుతున్నామన్నారు. త్వరలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, నాగేశ్వరరావు, ఇక్బాల్, కార్పొరేటర్లు మహమ్మద్ ఫుర్ఖాన్, గుండు చందన పూర్ణచందర్, చింతాకుల అనిల్‌కుమార్, కావేటి కవిత, బైరబోయిన ఉమాదామోదర్, సురేశ్‌జోషి, ముష్కమల్ల అరుణసుధాకర్, భోగి సువర్ణ, సోమిశెట్టిప్రవీణ్, బాల్నే సురేశ్, స్థానిక నాయకులు ఆయూబ్, చిప్ప వెంకటేశ్వర్లు, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీలో వాగ్వాదం

వరంగల్ ఎల్‌బీనగర్‌లో సోమవారం మంత్రి కొండా సురేఖ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడి మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం. రెండు మండలాల పరిధిలోని డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను ఎల్‌బీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్లు తమ డివిజన్ లబ్ధిదారులకు మంత్రి చెక్కుల అందజేత సమయంలో ఫొటోలు దిగారు. ఈక్రమంలో 21వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సందీప్ స్థానిక కార్పొరేటర్‌తో చెక్కుల పంపిణీ పాల్గొన్నారు. రాని వారి చెక్కులు తనకు ఇస్తే ఆయా లబ్ధిదారులకు ఇస్తానని పేర్కొనడంతో కార్పొరేటర్ నిరాకరించారు. దీంతో ఆగ్రహానికి గురైన డివిజన్ అధ్యక్షుడు మీరే పంపిణీ చేస్తారా.. మేం పార్టీ నాయకులం కాదా అంటూ బూతులు మాట్లాడినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన కార్పొరేటర్.. ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సందీప్‌ను అదుపులోకి తీసుకుని రెండు గంటల అనంతరం విడిచిపెట్టినట్లు తెలిసింది.

రైలు పట్టాలపై కార్మికుల జాతర

- కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో థర్డ్‌లైన్ మెగా బ్లాక్
- పాల్గొన్న రైల్వే అధికారులు, 400 మంది సిబ్బంది



రైలు పట్టాలపై వర్క్ చేస్తున్న కార్మికులు

కాజీపేట రూరల్ : కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో హసన్‌పర్తి రూట్‌వైపు సోమవారం రైలు పట్టాలపై పెద్ద ఎత్తున రైల్వే కార్మికులు గ్యాంగ్‌వర్క్ చేపట్టారు. మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా మెగా రైల్వే బ్లాక్ చేపట్టారు. నాలుగు గంటల పాటు చేపట్టిన ఈ బ్లాక్‌లో కాజీపేట అన్ని విభాగాల రైల్వే అధికారులు, సికింద్రాబాద్ డివిజన్ అధికారులు, సుమారు 400 మంది రైల్వే కార్మికులు శ్రమించారు. మూడో రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించిన రైలు పట్టాల అమరిక, ఫిట్టింగ్, ఇతరత్రా టెక్నికల్ వర్క్‌ను క్రేన్, పరికరాలు, కార్మికులతో చేపట్టారు. మూడో రైల్వే లైన్ నిర్మాణంతో హసన్‌పర్తి–వరంగల్, హసన్‌పర్తి–కాజీపేట జంక్షన్ మధ్య ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు ఎలాంటి అంతరాయం కలగకుండా నేరుగా ప్రయాణిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. టెంట్లు వేసి, ఎర్రజెండాలు రైల్వేట్రాక్‌కు అడ్డంగా కట్టి రైల్వే కార్మికులు జాతరలా పట్టాలపై గ్యాంగ్‌వర్క్ చేయడంతో పక్కనుంచి రైళ్లలో వెళ్లే ప్రయాణికులు ఆసక్తిగా చూశారు. ఈ రైల్వే బ్లాక్‌లో రైల్వే అధికారులు కాజీపేట డిప్యూటీ సీఈ, సజ్జా బార్గవ్‌కృష్ణా, కన్‌స్ట్రక్షన్ ఈఈ బద్దియ్య, రైల్వే టీఐ అగ్గి రవీందర్, పీడబ్ల్యూఐ గోపి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

- భీష్మనగర్‌లో ఘటన



దినేశ్(ఫైల్)

చిట్యాల: బైక్ అదుపు తప్పి మిషన్ భగీరథ గేట్‌వాల్వ్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలోని జడలపేట శివారు భీష్మనగర్ మలుపు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపేటకు చెందిన మధుకవి దినేశ్ (29) ప్రైవేట్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. చిట్యాలలో పని ముగించుకుని రాత్రి బైక్‌పై తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో భీష్మనగర్ వద్ద ఎదురుగా వస్తున్న కారు వెలుతురుకు బైక్ అదుపుతప్పి మిషన్‌భగీరథ గేట్‌వాల్వ్‌ను ఢీకొంది. ఈ ఘటనలో దినేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్నేహితులు, గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడు తండ్రి దామోదరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

విషజ్వరంతో మరో యువకుడు..



రామచంద్రం(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బెగుళూర్ గ్రామానికి చెందిన యువకుడు పొట్లపల్లి రామచంద్రం(24) విషజ్వరంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రామచంద్రం తల్లిదండ్రులు చిన్నతనంలో మృతి చెందగా బంధువుల వద్ద పెరిగాడు. కాగా, బెగుళూర్‌లోనే కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక యూత్ సభ్యులు మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు. జ్వరానికి తోడు పసిరికలు ముదిరిపోవడంతో సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

చిల్పూరులో చైన్‌స్నాచింగ్..

- మహిళ మెడలోనుంచి బంగారు గొలుసు అపహరించుకెళ్లిన దుండగులు



వివరాలు వెల్లడిస్తున్న రాధిక

చిల్పూరు: మండల కేంద్రంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. సోమవారం మధ్యాహ్న సమయంలో హెల్మెట్లు ధరించిన ఇద్దరు దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి మహిళ మెడలోని 3 తులాల బంగారు గొలుసు అపహరించుకెళ్లారు. బాధితురాలు రాధిక కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిటి లింగయ్య తన ఇంట్లోనే ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బయటకు వెళ్లగా ఇద్దరు దుండగులు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనంపై షాపు ముందుకు వచ్చారు. ఆ సమయంలో లింగయ్య భార్య రాధిక షాపులో ఉంది. ఇందులో ఓ వ్యక్తి బైక్ దిగగా మరో వ్యక్తి వాహనం పైనే కూర్చున్నాడు. లోపలికి వెళ్లిన వ్యక్తి కత్తితో బెదిరించి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును తెంపుకుని ద్విచక్రవాహనంపై పారిపోయారు. అప్పటికే రాధిక దొంగలు అని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాధితురాలు రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 10 తులాల బంగారం, 5 తులాల వెండి, రూ.2 లక్షల నగదు అపహరణ

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూడిక లక్ష్మి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లింది. సోమవారం ఉదయం ఇంటి తాళం తీసి ఉండడంతో స్థానికులు లక్ష్మి వచ్చిందనుకుని భావించారు. లక్ష్మి ఇంటికి వెళ్లి చూడగా తాళం పగుల గొట్టి కనిపించింది. అనుమానంతో నర్మెటలో ఉంటున్న కూతురుకు విషయం తెలపగా వెంటనే చేరుకుంది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులో 10 తులాల బంగారం, 5 తులాల వెండి, రెండు రూ. 2 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

రూ. 8 లక్షల విలువైన గుట్కా పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

జనగామ రూరల్: టాస్క్‌ఫోర్స్ పోలీసులు జనగామలో భారీస్థాయిలో గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నారు. సోమవారం పట్టణంలోని కుర్మవాడలో ఓ ఇంటి నుంచి కారులో తీసుకెళ్తున్న రూ. 8లక్షల 36 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. అనంతరం కారును స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, దిలీప్‌ను సీపీ అంబర్‌కిశోర్ ఝా అభినందించారు.

మా అమ్మను బతికించండి..

- దాతలను చేతులెత్తి వేడుకుంటున్న చిన్నారులు
- డెంగీ బారిన పడి చికిత్స పొందుతున్న మహిళ
- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న నిరుపేద
- వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సౌజన్య

రాయపర్తి: అసలే నిరుపేద కుటుంబం. రెక్కాడితేకాని డొక్కాడని పరిస్థితి. ఈ సమయంలో ఆ ఇల్లాలు అనారోగ్యానికి గురై మృత్యువుతో పోరాడుతోంది. మాయదారి రోగం డెంగీ బారిన పడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీంతో తల్లి ఎడబాటును భరించలేక ఇద్దరు పిల్లలు గుక్కపెట్టి ఏడుస్తున్నారు. దాయర్థహృదయులు స్పందించి ఎలాగైనా తమ తల్లిని బతికించాలని చేతులెత్తి మొక్కుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రానికి చెందిన ఐత యాకయ్య, యాకమ్మ దంపతుల పెద్ద కుమార్తె సౌజన్యకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటకు చెందిన పసునూరి రమేశ్‌తో వివాహం జరిపించారు. రమేశ్ పెయింటింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.ఈ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో ఇటీవల సౌజన్య డెంగీ బారిన పడి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తమ శక్తికి మించి రూ.4 లక్షల వరకు అప్పు చేసి చికిత్స అందిస్తున్నప్పటికీ కోలుకోలేదు. వైద్యానికి ఇంకా ఖర్చు కావాల్సి ఉంది. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తన కుమార్తెను బతికించాలని తల్లిండ్రులు, తమ తల్లిని రక్షించాలని చిన్నారులు వేడుకుంటున్నారు. దీనిపై దాయర్థహృదయులు స్పందించి వైద్య ఖర్చుల కోసం సాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

81429 17022, 95509 12785 నంబర్లకు దాతలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా సాయం చేయాలని కోరుతున్నారు.